సాక్షి శ్రీకాకుళం

శనివారం । 24 । ఆగస్టు । 2024



గ్రామసభల్లో రభస

జిల్లాలో నిర్వహించిన గ్రామసభల్లో పలుచోట్ల రభస జరిగింది. సర్పంచ్‌లకు అవమానాలు ఎదురయ్యాయి. - 8లో



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో ఓ సచివాలయ ఉద్యోగి మృతి చెందారు. అతని భార్య ఇప్పుడు 9 నెలల గర్భిణి. - 8లో

15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరు

అరసవల్లి: 15వ ఆర్థిక సంఘ రెండో విడత నిధుల మంజూరులో భాగంగా జిల్లాలో గ్రామ పంచాయతీలకు గాను రూ.36,45,79,005 మంజూరైనట్లుగా ఇన్‌చార్జి డీపీఓ వెంకట్‌రామన్ తెలియజేశారు. జిల్లాలో ఉన్న 896 పంచాయతీల్లో అత్యధికంగా మందస మండలంలోని 41 పంచాయతీలకు రూ.1,62,52,089, అత్యల్పంగా సరుబుజ్జిలి మండలంలోని 21 పంచాయతీలకు రూ.63,72,574 మంజూరయ్యాయి.

న్యూస్‌రీల్

నేడు జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నరసన్నపేట: స్థానిక జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా శనివారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు తెలిపారు. హెచ్‌సీఎల్ కంపెనీ ఈ జాబ్‌మేళా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 75 శాతం మార్కులు పైబడి సాధించి ఉండాలన్నారు. దీంట్లో ఉద్యోగ అవకాశాలు పొందగలిగే వారు ఇంటర్వ్యూలో అర్హత సాధించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మధురైలో 3 నెలలు శిక్షణ ఉంటుందని, అనంతరం 9 నెలలు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో నెలకు పది వేలు స్టైఫెండ్ ఇస్తారని అనంతరం రూ.1.75లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం పొందుతారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వచ్చి పాల్గొనవచ్చన్నారు.

ఇసుక వాహనాల పట్టివేత



ఆమదాలవలస పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సీజ్ చేసిన వాహనాలు

ఆమదాలవలస: మండల పరిధిలో నాగావళి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను శుక్రవారం ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నెల్లిమెట్ట గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో చిలకపాలెం గ్రామానికి చెందిన ఇసుకతో ఉన్న లారీ మరో ఖాళీ లారీతో పాటు రెండు ట్రాక్టర్లు ఒక జేసీబీని సీజ్ చేశారు. ఇసుక తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను విచారించగా వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని రుజువు కావడంతో కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ ఇసుక విక్రయం



పాతసుందరపాలెం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీ ఇసుక



రేగపాలెం తోటల్లో అర్ధరాత్రి పోగు చేసిన కల్తీ ఇసుక

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీలో గల పాతసుందరపాలెం, లావేరు మండలంలోని రేగపాలెం సరిహద్దు ప్రాంతాల్లోని అటవీ భూముల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా కల్తీ ఇసుకను నిల్వ చేసి తదుపరి అర్ధరాత్రులు ఇతర ప్రాంతాలకు భారీ లారీల్లో రవాణా చేస్తున్నారని ఆ పరిసర ప్రాంత గ్రామస్తులు చెబుతున్నారు. ఇసుక కొరతను ఆసరాగా చేసుకుని కొచ్చెర్ల పంచాయతీకి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో సముద్ర దిబ్బ ఇసుక, బుచ్చవానిగెడ్డ ఇసుక రెండు మిక్సింగ్ చేసి సమీప తోటల్లో నిల్వ ఉంచుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా భారీ లారీల్లో కల్తీ ఇసుకను అక్రమంగా రవాణా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి కల్తీ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

మా భద్రతకూ కావాలి భరోసా..



ప్రత్యేక రక్షణ కావాలి..



విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలి. దాడులు చేసిన వ్యక్తులకు కఠినమైన శిక్ష వేయాలి. జైల్లో పెట్టి ఊరుకోకుండా ఉరి తీయాలి.

– డాక్టర్ అనూషా, బాతువ పీహెచ్‌సీ, జి.సిగడాం

కనీస అవసరాలు తీర్చుకునేందుకు కాసిన్ని మౌలిక సదుపాయాలు, అపాయాలు వచ్చినప్పుడు రక్షించేందుకు కొన్ని జాగ్రత్తలు, నిర్భయంగా పనిచేసేలా సురక్షిత పరిసరాలు, ఆస్పత్రికి వెళ్లి మళ్లీ భద్రంగా ఇంటికి తిరిగి వచ్చేలా భరోసా.. ఇంతే.. కావాల్సినవల్లా ఇవే. మహిళా వైద్యులు, ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా వైద్య సిబ్బంది వీటి కోసమే ఎదురుచూస్తున్నారు. కోల్‌కతా వంటి సంఘటనలు మన వద్ద జరగకూడదంటే ఈ జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరుతున్నారు. ప్రసంగాలకు, ప్రకటనలకు పరిమితం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పటిష్ట భద్రత అవసరం



ఆసుపత్రుల్లో రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎటువంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. కొన్ని సందర్భాల్లో రోగులతో వచ్చే వారితో ఇబ్బందులు వస్తుంటాయి. అటువంటి పరిస్థితులు లేకుండా రాత్రి వేళల్లో సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి.

– కె.శ్రావణి, స్టాఫ్ నర్స్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి టెక్కలి

ప్రజల కంట్లో.. ఉచిత ఇసుక

- ఉచితం పేరుతో ఇసుకను ఖరీదైన వస్తువుగా మార్చేసిన కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో స్టాక్ చేసిన ఇసుకతోనే ఇంతవరకు కాలక్షేపం
- ఈ ప్రభుత్వంలో ఒక్క టన్ను ఇసుక కూడా తవ్వి సమకూర్చని పరిస్థితి
- టెక్కలి స్టాక్ పాయింట్‌లో ఇసుక ఖాళీ
- జిల్లా మొత్తానికీ అంగూరే దిక్కు
- అక్కడ కూడా అయిపోయిన ఇసుక
- మరోవైపు ఇసుక దందా సాగిస్తున్న అధికార పార్టీ నాయకులు



అంగూరు స్టాక్ పాయింట్‌లో గురువారం మధ్యాహ్నానికి ఉన్న ఇసుక

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇసుక ఉచితం అని ప్రకటన చేసిన ప్రభుత్వం ఇప్పుడు దాన్ని ఖరీదైన వస్తువుగా మార్చేసింది. గత ప్రభుత్వంలో అధికారికంగా ఏజెన్సీ ద్వారా సేకరించి ఉన్న ఇసుకను స్టాక్ పాయింట్‌గా పెట్టి ప్రచార ఆర్భాటాలతో విక్రయాలు ప్రారంభించిన కూటమి ప్రభుత్వం తమ హయాంలో ఒక్క టన్ను కూడా తవ్వి తీయలేదు. కొత్తూరు మండలంలో అప్పటికే ఉన్న 40వేల మెట్రిక్ టన్నులతో ఒక పాయింట్‌ను, టెక్కలిలో సిద్ధంగా ఉన్న 8వేల మెట్రిక్ టన్నులతో ఒక పాయింట్ ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. పైగా ఉచితం అని పేరు పెట్టి అనుచితంగా వ్యవహరించారు. ఫ్రీ అంటూనే టన్నుకు రూ.340 ధర నిర్ణయించి విక్రయించడం ప్రారంభించారు. ట్రాక్టర్ ఇసుకైతే రూ.1700 చెల్లించాల్సిందేనని చెప్పడంతో కంగుతింటున్నారు. 10 టన్నుల లారీకైతే రూ.3400, 18 టన్నుల లారీకైతే రూ.6120 చెల్లించాల్సి వస్తోంది. ఇది కేవలం ఇసుక కోసం సమర్పించుకోవాల్సింది. రవాణా అదనం. దూరాన్ని బట్టి లారీ యజమాని ఎంత అడిగితే అంత ఇవ్వాల్సిందే.

ఇసుకను మింగేసి..

కూటమి ప్రభుత్వం వచ్చేసరికి జిల్లాలో ఐదారుచోట్ల గత ప్రభుత్వంలో సేకరించిన ఇసుక ఉండేది. ఎన్నికల్లో కూటమి గెలిచిన రోజునే స్టాక్ ఇసుకను వదిలేసి వెళ్లిపోవాలని అప్పటికే సేకరించిన ఏజెన్సీకి హుకుం జారీ చేశారు. దీంతో వారంతా ఉన్న ఫలంగా ఇసుకను వదిలేసి వెళ్లిపోయారు. అలా వదిలేసిన ఇసుక తర్వాతి కాలంలో మాయమైంది. కేవలం కొత్తూరు మండలం అంగూరు, టెక్కలిలో మాత్రమే స్టాక్ ఉన్నట్టు చూసి విక్రయ పాయింట్లు ఏర్పాటు చేశారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచే మిగత ఏరియాలోని ఇసుకను మింగేశారు. అంతటితో ఆగకుండా ఎక్కడికక్కడ అక్రమ తవ్వకాలు జరిపి లాభపడుతున్నారు.

ప్రస్తుత పరిస్థితేంటి?

టెక్కలిలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఎప్పుడో ఇసుక అయిపోయింది. కొత్తూరు మండలం అంగూరులో ఉన్న ఇసుక నేటితో అయిపోతోంది. ఈ లెక్కన జిల్లా ప్రజలకు అధికారికంగా ఇసుక అందుబాటులో లేనట్టే. ఎందుకంటే, ఇప్పటివరకు ఎక్కడా అధికారిక తవ్వకాలు జరిపి, ఇసుకను సిద్ధం చేసిన పరిస్థితి లేదు. నూతన ఇసుక విధానం వచ్చే నెల 11నుంచి అమల్లోకి వస్తుంది. అంటే అంతవరకు వినియోగదారులు వేచి ఉండాల్సిందేనా?

ఉచితమంటే ఇదేనా..

- టెక్కలి పరిసర ప్రాంతాలకు ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ. 6500 నుంచి రూ.7 వేల ధర పలుకుతోంది. అంగూరు నుంచి ఇక్కడకు ఇసుకను తీసుకువస్తున్నారు. అలాగే 18 టన్నుల ఇసుక రూ.25 వేలు పలుకుతోంది. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో టెక్కలి స్టాక్ పాయింట్ నుంచి రూ.4500కు ట్రాక్టర్ ఇసుక లభించేంది. అలాగే రూ.16వేల నుంచి రూ.18 వేలకే 18టన్నుల లారీ ఇసుక లభించేది.
- రణస్థలం మండల కేంద్రానికి ప్రస్తుతం 10 టన్నుల లారీ ఇసుక రూ. 14వేల ధర పలుకుతోంది. అదే గత ప్రభుత్వంలో అదే లారీ ఇసుక రూ. 9వేలకు దొరికేది.

అధికారిక లెక్కల ప్రకారం

10 మెట్రిక్ టన్నుల ఇసుక ధర	10 మెట్రిక్ టన్నుల రవాణా చార్జీ	మొత్తం వ్యయం (రూ.ల్లో)
3400	10 కి.మీ. దూరానికి రూ. 1633	5,033
3400	15 కి.మీ. దూరానికి రూ. 2035	5,435
3400	20 కి.మీ. దూరానికి రూ. 2438	5,838
3400	35 కి.మీ. దూరానికి రూ. 3,668	7,068



నాటు బళ్లతో తరలిస్తున్న ఇసుక

భవన కార్మికుల బతుకుల మాటేమిటి?

ప్రస్తుతానికి ఇసుక అందుబాటులో లేదు. స్టాక్ పాయింట్లు ఖాళీ అయిపోయాయి. అధికారికంగా వినియోగదారులకు ఇసుక దొరికే అవకాశం లేదు. ఈ లెక్కన భవన నిర్మాణాలకు ఇసుక దొరకట్టే. అదే జరిగితే జిల్లాలో జరుగుతున్న నిర్మాణాలు ఆగిపోయి కార్మికులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. జిల్లాలో లక్షా 20వేల మంది భవన నిర్మాణ కార్మికులున్నారు. ఇప్పటికే అందుబాటులో ఇసుక దొరక్కపోవడంతో అరకొరగా పనులు చేస్తున్నారు. ఇప్పుడేకంగా ఇసుక దొరక్కపోతే పూట గడవడం కష్టం కానుంది. జిల్లాలో ఇసుక లేకపోవడంతో ఒడిశా నుంచో మరెక్కడినుంచో తెచ్చుకోవల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏర్పడి 75 రోజులు కావస్తోంది. ఇప్పటివరకు తమవంతుగా ఎప్పటికప్పుడు అవసరం మేరకు ఇసుకను సమకూర్చే ప్రయత్నం చేయలేదు. గతంలో ప్రభుత్వం సేకరించిన ఇసుకను విక్రయిస్తూ కాలం గడుపుతూ వచ్చిందే తప్ప కొత్తగా తవ్వకాలు జరిపి, ఇసుకను అందుబాటులోకి తీసుకురాలేదు. టెక్కలిలో స్టాక్ అయిపోవడం, అంగూరు నుంచి తెచ్చుకోవడానికి తడిసి మోపెడవుతుండడంతో ఇబ్బంది తప్పడం లేదు. జిల్లాలో 18టన్నుల ఇసుక కోసం రూ.19 వేల నుంచి రూ.28వేలు వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అంటే ఇసుక బంగారమైపోయింది.

టీడీపీ నేతలకు పండగ..



జిల్లాలో అధికారిక ఇసుక స్టాక్ పాయింట్లలో సరుకు అయిపోవడంతో టీడీపీ నాయకులు పండగ చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ ఇసుకను అడ్డగోలుగా అమ్ముకుని భారీగా గడిస్తున్నారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, హిరమండలం తదితర ప్రాంతాల్లో అడ్డగోలుగా ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్నట్టుగా ఇసుక దందా సాగిపోతోంది. అధికారులూ నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారు. వారికి దొరుకుతున్న లారీలు, ట్రాక్టర్లే అక్రమ ఇసుక దందాకు నిలువెత్తు సాక్ష్యాలు.



ఆమదాలవలసలో ఇసుక కొరతతో పనులు నిలిపేసిన నిర్మాణంలో ఉన్న భవనం

ఖర్చు తడిసి మోపెడే..

అధికారిక ప్రకటన మేరకే 10 టన్నుల ఇసుకకు కేవలం 35 కిలోమీటర్లకి రూ.7068 అవుతుంది. అదే 18 టన్నుల లారీకైతే దాదాపు డబుల్ అయ్యే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా చూస్తే ఏ మండలానికి ఆ మండలంలో ఇసుక అందుబాటులో ఉంటేనే ఈ ధరలు పలుకుతాయి. అంతకుమించి పెరిగితే రవాణా ఛార్జీ తడిసి మోపెడే అని ప్రభుత్వం ప్రకటించిన రవాణా చార్జీలే చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం పెట్టిన రెండు స్టాక్ పాయింట్లనే పరిగణలోకి తీసుకుంటే పాతపట్నం, టెక్కలి తప్ప మిగతా నియోజకవర్గాలన్నింటికీ కనిష్టంగా 70 కిలోమీటర్లు.. గరిష్టంగా 150కిలోమీటర్ల వరకు ఇసుక అందుబాటులో ఉన్నట్టు అవుతోంది. ఈ లెక్కన రవాణా చార్జీలు ఎంత అవుతాయో చెప్పనక్కర్లేదు. ఇక ముందు కూడా ఇసుక కష్టాలు తప్పేలా లేవని కొనుగోలుదారులు చెబుతున్నారు.



నియోజకవర్గం	ఇచ్ఛాపురం	పలాస	టెక్కలి	ఆమదాలవలస	పాతపట్నం	నరసన్నపేట	ఎచ్చెర్ల	శ్రీకాకుళం
18 టన్నులు ఇసుక ధర (రూ.లలో)	27,720	25,500	25,000	19,000	19,500	19,500	25,000	20,750

ఇసుక ర్యాంపులు పెంచాలి



ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో దూరం నుంచి ఇసుక తెచ్చేందుకు భవన నిర్మాణ యజమానులు ఎక్కువ డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. వంశధార నదీ తీరంలో మరిన్ని ఇసుక ర్యాంపులు పెంచితే రవాణా ఖర్చులు తగ్గుతాయి. నిర్మాణ పనులు పెరుగుతాయి. ఇసుక లభించటం కష్టంగా ఉంటోంది.

– పిల్లా అర్జునరావు, భవన నిర్మాణ మేస్త్రి, తురకపేట, ఎల్.ఎన్.పేట

ప్రయోజనం లేదు..



ఉచిత ఇసుక వల్ల ట్రాక్టర్ల యజమానులకు ప్రయోజనం లేదు. అంగూరు స్టాక్ పాయింట్ వద్దకు వెళ్తే ఆరు గంటలు నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో రోజుకు ఒక ఇసుక లోడ్ మాత్రమే వేయగలుగుతున్నాం. ఇది గిట్టుబాటు కావడం లేదు. వినియోగదారులు నాటుబళ్ల ద్వారా ఇసుక వేయించుకుంటున్నారు.

– గార రాజులు నాయుడు, ట్రాక్టర్ యజమాని, మాకవరం, కొత్తూరు మండలం

ఇసుక దొరక్క ఇబ్బంది



మండలంలో ఇసుక దొరక్క ఇబ్బందులు పడుతున్నాం. కొత్తూరు మండలం నుంచి ఇసుక వస్తోంది. గతంలో ట్రాక్టర్ యాజమానికి అడిగిన వెంటనే ఇసుక తీసుకువచ్చేవారు. ఇప్పుడు రెండు రోజులు పడుతోంది. రేటు కూడా అందుబాటులో లేదు.

– ఎం.నారాయణరెడ్డి, సీది గ్రామం, పాతపట్నం మండలం

పనులకు దూరమవుతున్నాం



మూడు నెలలుగా ఇసుక అందుబాటులో లేక పనులకు దూరమయ్యాం. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. గత ప్రభుత్వంలో కార్మికులను ఆదుకునేవారు. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాము. ఇసుక కోసం ఎదురు చూపులు చూస్తున్నాం.


– గుగ్గిళ్ల సూర్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుడు, కృష్ణాపురం, ఆమదాలవలస

పనులు ఆపేశాం..



ఇసుక లేక ఇంటి పనులు ఆపేశాం. గతంలో రూ.2000కు ఇసుక మా ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చేవారు.ఇప్పుడు రూ.5,500 అంటున్నారు. అది కూడా కొత్తూరు నుంచి తీసుకురావాలని చెబుతున్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించి కూడా ఇంకా దాని ఊసు ఎత్తడం లేదు.

– గొరివిల్లి కృష్ణమూర్తి, భవననిర్మాణదారుడు, మేస్త్రి, పొన్నాంపేట, ఆమదాలవలస మండలం



గురువారం మధ్యాహ్నం సమయానికే అంగూరు స్టాక్ పాయింట్ బయట క్యూ కట్టిన ట్రాక్టర్లు

'టంగుటూరి'కి ఘనంగా నివాళి



టంగుటూరి చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్‌ఓ అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తెల్లదొరలను గడగడలాడించిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర కేసరి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అనురాధ, కలెక్టరేట్ ఏఓ సూర్యనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 15 వినతులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు పదిహేను వినతులు వచ్చాయి. శుక్రవారం ఉదయం 11.30 నిమిషాలకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు విచ్చేసి సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికలో పదిహేను ఫిర్యాదులు రాగా అందులో 5 భూతగాదాల పైన, 2 ఆస్తి సంబంధాలపైన, 1 శారీరక నేరాలపై, 1 పరిపాలనకు సంబంధించి, పాత ఫిర్యాదులపై 1, ఇతరితర అంశాలతో 5 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజలు శ్రీకాకుళం వరకు రాకుండా ఇక్కడ గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.



కాశీబుగ్గలో వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

జాబ్‌మేళాలో 61 మంది ఎంపిక



నియామక ఉత్తర్వులు అందుకున్న యువతులతో సంస్థ ప్రతినిధులు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 61 మంది ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజ్ వెనుక నెహ్రూ యువకేంద్రం ప్రాంగణంలో ఐఐఎఫ్ఎల్ సమస్త ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో వివిధ స్థాయిల ఉద్యోగాల భర్తీకిగాను జరిగిన ఈ జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 113 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరికి వివిధ మౌఖిక పరీక్షల అనంతరం 61 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారికి ఆ సంస్థ హెచ్‌ఆర్‌లు నాగేశ్వరరావు, రామకృష్ణంరాజు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, ఎన్‌వైకే సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు హాజరైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం విధులకు హాజరయ్యారు. 34 మంది ఉద్యోగులను తొలగించినట్లు వారికి చెప్పిన అధికారులు ప్రస్తుతం మాట మార్చారు. వర్సిటీలో గురువారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాలు ముందు నిరసన తెలియజేయటంతో స్థానిక అధికారులను ఉన్నతాధికారులు నివేదిక అడిగినట్లు సమాచారం. 'సాక్షి'లో వచ్చిన 'పొట్ట కొట్టారు' కథనంపై సైతం వివరణను వర్సిటీ అధికారులను అడిగినట్లు సమాచారం. దీంతో ఉద్యోగులను తొలగించ లేదని, ఆందోళనలు చేయవద్దని అధికారులు వారిని పిలిపించి చెప్పారు. దీంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎప్పటి లాగే విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈసీ సమావేశం కోసం ఉన్నతాధికారుల అనుమతి కోరుతున్నారు. నిబంధనలు పాటించలేదని ఈసీలో పెట్టి ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నారు.



సెక్యూరిటీ కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో నియమ నిబంధనల మేరకు సెక్యూరిటీ కల్పించాలి. ప్రస్తుతం ప్రొటోకాల్ ప్రకారం వైద్యులకు ఆస్పత్రుల్లో సెక్యూరిటీ ఉండటం లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అలాగే మరిని సౌకర్యాలు పెంచాలి.

– స్ఫూర్తి లహరి, వైద్య నిపుణుపురాలు, ఏరియా ఆస్పత్రి, నరసన్నపేట

కఠినంగా శిక్షించాలి



పలాస పారిశ్రామికవాడలో కరపత్ర ఆవిష్కరణలో మహిళలు

కాశీబుగ్గ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యంత అమానుషంగా అత్యాచారం చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఉత్తరాంధ్ర మహిళా సంఘం డిమాండ్ చేసింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ, పారిశ్రామిక వాడలో కార్మిక మహిళలతో ఉత్తరాంధ్ర మహిళా సంఘం డిమాండ్ చేసిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ఉత్తరాంధ్ర మహిళా సంఘం కార్యదర్శి బి.నాగమణి, లక్ష్మి బానమ్మ, చింతల పార్వతి తదితర శ్రామిక మహిళలందరూ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోలింగ్ ఉండాలి



ఆస్పత్రుల ప్రాంతాల్లో రాత్రిళ్లు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలి. ఆస్పత్రుల వద్ద సెక్యూరిటీ వ్యవస్థను పటిష్టం చేయాలి. మహిళలు, పురుషుల వార్డులు వేర్వేరుగా ఉండాలి. ప్రతి డాక్టర్‌కు పూర్తి రక్షణ కల్పించాలి. డాక్టర్ల రక్షణకు కొత్త చట్టాలు తీసుకురావాలి.

– ప్రీతి ప్రత్యూష, రక్త పరీక్షల నిపుణురాలు, ఏరియా ఆస్పత్రి, నరసన్నపేట

క్లుప్తంగా

అరసవల్లి ఆలయానికి మళ్లీ రెగ్యులర్ ఈఓ

అరసవల్లి: రాష్ట్ర దేవదాయ శాఖలో ప్రస్తుతం బదిలీల ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు ఉన్న వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ ఈఓగా ప్రస్తుతానికి వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌లో ఈ ఏడాది మార్చి 15 నుంచి డిప్యూటీ కమిషనర్/ఈవోగా పనిచేస్తున్న ఎస్.చంద్రశేఖర్ తిరిగి తన రెగ్యులర్ వర్కింగ్ స్థానమైన అన్నవరం దేవస్థానానికి వెళ్లే అవకాశాలున్నాయి. దీంతో ఈ ఏడాది మార్చి 13 వరకు అరసవల్లి ఈఓగా, మొదటి డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తించి అన్నవరానికి బదిలీ అయిన రమేష్‌బాబు తిరిగి అరసవల్లి ఆలయానికి ఈఓగా రానున్నారని తెలుస్తోంది. అయితే ఆ తర్వాత జరిగే బదిలీల ప్రక్రియలో అరసవల్లికి కొత్త ఈఓ రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే పలువురు ఆశావహులు మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

కులం పేరుతో దూషించిన నలుగురికి ఆరునెలల జైలు శిక్ష

జి.సిగడాం: కులం పేరుతో దూషించిన నేరం రుజువు కావడంతో నిద్దాం గ్రామానికి చెందిన నలుగురికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ 4వ అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. 2015 సంవత్సరంలో గ్రామానికి చెందిన పొన్నాడ అప్పారావు పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి కొలతలు వేస్తూ ఉండగా గ్రామానికి చెందిన గిరడ చిన్న ముళ్లునాయుడు, గిరిడ కృష్ణారావు, గిరడ రమేష్, గిరడ రాంబాబులు కలిసి అప్పారావును కులంపేరుతో దూషించి దాడి చేశారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ జి.భాస్కరరావు కేసు నమోదు చేశారు. ఉమ్మడి జిల్లా పాలకొండ డీఎస్పీ ఆదినారాయణ దర్యాప్తు చేశారు. శుక్రవారం కేసు వాదనకు రాగా నేరం రుజువు కావడంతోన్యాయమూర్తి ఫణికుమార్ పైన పేర్కొన్నట్టుగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేట గ్రామ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బొరిగిపేట గ్రామానికి చెందిన కవిటి బాలకృష్ణ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా.. అతనికి ఎదురుగా మేఘవరం గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి అనే వ్యక్తి ద్విచక్రవాహనం పై వస్తూ బొరిగిపేట చెరువు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వారిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు వివరాలు సేకరించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు కసరత్తు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల నిర్వహణకు ఆర్ సెట్ మార్గదర్శకాలను అనుగుణంగా కసరత్తు చేస్తున్నారు. వర్సిటీలో అర్హులైన రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్న కోర్సుల్లో ఫుల్ టైం, పార్ట్ టైం ప్రవేశాలు కల్పించనున్నారు. బయోటెక్నాలజీలో ఏడు, ఎకనామిక్స్‌లో రెండు, సోషల్‌వర్క్‌లో ఒకటి ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్‌లో రెండు, బయోటెక్నాలజీలో నాలుగు, కెమిస్ట్రీలో నాలుగు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్‌లో ఒకటి, ఫిజిక్స్‌లో ఒకటి, కెమిస్ట్రీలో నాలుగు ఉన్నాయి. ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలను అనుగుణంగా ప్రవేశాలు కల్పిస్తారు.

వ్యక్తి అదృశ్యం



నారాయణ మూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామానికి చెందిన 63 ఏళ్ల పైడి నారాయణ మూర్తి ఈ నెల 22వ తేదీ నుంచి కనిపించటం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు 7671889907కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఆమదాలవలస: తొగరాం గ్రామానికి చెందిన సువ్వారి చంద్రరావు (29) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య సువ్వారి బుజ్జి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చంద్రరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, పోసు బాబు అనే వ్యక్తి మానసికంగా వేధించడంతో ఈ నెల 17న మద్యంలో గడ్డి మందు కలిపి తాగేశాడని ఆమె తెలిపారు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని ఆమె పేర్కొన్నారు.

గ్రామసభల్లో రభస

- సర్పంచ్‌లకు అడుగడుగునా అవమానాలు
- పలుచోట్ల కూటమి నాయకులకు నిలదీతలు, వాగ్వాదాలు
- నిరసన వ్యక్తం చేసిన సర్పంచ్‌లు



జి.సిగడాం: ధవళపేట పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు కోసం ఎదురుచూస్తున్న సర్పంచ్, వార్డుమెంబర్లు

జి.సిగడాం: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు పలు చోట్ల రసాభాసగా ముగిశాయి. శ్రీకాకుళం మండల పరిధి సానివాడలో జరిగిన కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు హాజరై.. ఆ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పలు చోట్ల సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వకుండా గ్రామసభలు నిర్వహించారు. జి.సిగడాం మండలం వాండ్రంగి గ్రామంలో గ్రామసభ రసాభాసగా జరిగింది. ఎన్నికల ముందు గ్రామంలో ఉన్న ప్రజలకు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని కొందరు నిలదీశారు. తాగటానికి చుక్క నీరు లేకుండా నానా ఇబ్బందులు పడుతుంటే ఈ సభలు, ఈ సమావేశాలు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో శంకుస్థాపన చేసిన వాటర్ ట్యాంకును నిర్మించకుండా శ్మశాన వాటిక దగ్గర నిర్మాణం చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దీనిపై కూటమి నాయకులు సర్ది చెప్పడానికి చూడగా.. తాము ఎమ్మెల్యే దగ్గర తేల్చుకుంటామని స్థానికులు తెలిపారు.

చెప్పులు చూపిస్తూ వాగ్వాదం



సర్పంచ్ రమణితో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్యకర్త సనపల శ్రీనివాసరావు

జలుమూరు: జోనంకి గ్రామసభలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. సర్పంచ్ జీవి రమణి అధ్యక్షతన శుక్రవారం గంగధరపేట సచివాలయం వద్ద జరిగిన ఈ సభలో టీడీపీకి చెందిన సనపల శ్రీనివాసరావు, సువ్వారి రామకృష్ణలు, కూన ధర్మారావు, గురువెల్లి ప్రసాదరావులు వివాదం మొదలు పెట్టారు. గంగాధరపేట పేట చెరువులో చేపలు విక్రయిస్తామని టీడీపీ కార్యకర్తలు చెప్పగా.. సర్పంచ్ చెరువు పంచాయతీ ప్రజలదని మీది కాదని తేల్చి చెప్పేశారు. దీంతో టీడీపీ కార్యకర్తలు సర్పంచ్‌కు చెప్పులు చూపుతూ 'మా ప్రభుత్వం మా ఇష్టం ఎవరు అడ్డు వస్తారో చూస్తాం' అని పరుష పదజాలంతో దూషించారు. దీంతో సభలో తోపులాట జరిగింది. దీంతో సర్పంచ్ జీవి రమణి, ఎంపీపీ వాన గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ మధుసూదనరావు మాట్లాడుతూ ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేసుకున్నారని బైండోవర్ చేసి పంపామన్నారు.

సర్పంచ్‌ను ఎలా విస్మరిస్తారు..?



తొగరాం గ్రామంలో ప్రజలతో కలిసి నిరసన తెలుపుతూ మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ తమ్మినేని వాణీ సీతారాం

ఆమదాలవలస: ఏదైనా గ్రామంలో గ్రామసభ నిర్వహించినప్పుడు, సంబంధిత సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు కనీస సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం అన్నారు. తమ గ్రామంలో గ్రామ సభ నిర్వహణకు సంబంధించి, కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఆమె విస్మయం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామస్తులతో కలిసి ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు గ్రామ ప్రథమ పౌరులను అవమానించినట్లేనని అన్నారు. తమ నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజనవిభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు .



వాండ్రంగిలో కూటమి నాయకులను నిలదీస్తున్న కార్యకర్తలు

సర్పంచ్ లేకుండా గ్రామసభ

జి.సిగడాం: ధవళపేట గ్రామంలో నిర్వహించాల్సిన గ్రామసభ రచ్చకెక్కింది. పంచాయతీ కార్యాలయం వద్ద సభ కోసం రెండు రోజులుగా సర్పంచ్ వడిశ మహేశ్వరరావు దండోరా వేశారు. శుక్రవారం అక్కడ వేచి చూస్తుంటే.. గ్రామంలో కూటమి నాయకులు రచ్చబండ దగ్గర గ్రామసభ నిర్వహించారు. దీంతో అధికారులంతా అక్కడడకే వెళ్లిపోయారు. సర్పంచ్ గానీ, వార్డుమెంబరు గానీ ఎవరూ లేకుండా గ్రామసభ నిర్వహించారు. దీనిపై సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు నిరంకుశ పాలన డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కూటమి నాయకులతో సమావేశాలు, సమీక్ష పెట్టుకుంటే వారి ఇంటి వద్ద పెట్టుకోవాలి తప్ప ఇలా సర్పంచ్ లేకుండా సభలు నిర్వహించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. స్థానిక కార్యదర్శి తూతిక స్వాతి మాట్లాడుతూ మండల స్థాయి అధికారుల ఆదేశాల మేరకే ఇలా సభలు నిర్వహించామని అన్నారు.

అందుబాటులోకి శశిధర్ ఆస్పత్రి సేవలు



డాక్టర్ శశిధర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కూన ప్రమీల, పక్కనే డాక్టర్ శశిధర్

అరసవల్లి: అత్యాధునిక సౌకర్యాలు, ఎక్విప్‌మెంట్లతో నగరంలో డాక్టర్ శశిధర్ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందని, జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ భార్య కూన ప్రమీల అన్నారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద డాక్టర్ అన్నెపు శశిధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శశిధర్ హాస్పిటల్‌లో కొన్ని ముఖ్య విభాగాలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, రిటైర్డ్ ఏఎస్పీ అన్నెపు పురుషోత్తం, డీఎంహెచ్ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎస్పీ ఆఫీస్ సూపరింటెండెంట్ పైడి కోటేశ్వరరావు, అన్నెపు దివ్యా లీలాధర్, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, బొడ్డేపల్లి సురేష్, గూడేన సోమేశ్వరరావు, బగ్గు శ్రీనివాసరావు, కిల్లి సతీష్, ఎస్.రామకృష్ణ, బొడ్డేపల్లి యోగేష్, దుంపల హరిప్రసాద్, కింజరావు శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం ఆనంద్, శ్రీరంగం మధుసూధన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పేరాడ తిలక్



పేరాడ తిలక్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పేరాడ తిలక్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న తిలక్‌ను టెక్కలి నియోకజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పేరాడ తిలక్ టీడీపీ అభ్యర్థి కింజరావు అచ్చెన్నాయుడుకు గట్టి పోటీగా నిలిచారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కళింగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలు అందజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ప్రస్తుతం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న తిలక్‌కు టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈయన నియామకంపై నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తనపై ఎంతో నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా తిలక్ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారికి అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.

అచ్యుతాపురం బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత



పొందూరు: మృతుని భార్యకు రూ.కోటి చెక్కును అందిస్తున్న తహసీల్దార్



ఆమదాలవలస: చెక్కును మృతుని తండ్రికి అందిస్తున్న అచ్యుతాపురం తహసీల్దారు డి.రమేష్‌బాబు

పొందూరు: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జరిగిన పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన పొందూరుకు చెందిన హంస ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. కోటి చెక్కును తహసీల్దార్ రమేష్ అందించారు. ప్రశాంత్ స్వగృహంలో భార్య జ్యోతికి చెక్కును అందించారు. తహసీల్దార్‌తో పాటు ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో రేవతిరావు ఉన్నారు.

ఆమదాలవలస:అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీ పేలుడు ఘటనలో మృతిచెందిన ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్ కుటుంబానికి నష్ట పరిహారం అందింది. సంబంధిత రూ.కోటి చెక్కును శుక్రవారం వేకువ జామున వంజంగి గ్రామంలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం తహసీల్దార్ డి.రమేష్ బాబు రాజశేఖర్ తల్లిదండ్రులకు అందజేశారు.

ప్రమాదంపై న్యాయ విచారణకు డిమాండ్

ఎచ్చెర్ల:

అచ్యుతాపురంలోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై న్యాయ విచారణ చేపట్టాలని, యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల మండల కేంద్రం వద్ద శుక్రవారం ఈ విషయంపై ధర్నా నిర్వహించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అచ్యుతాపురంలో ప్రమాదానికి కారకులైన ఫార్మా కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఫార్మా, ఇతర పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అన్నారు.

ఫ్యాక్టరీస్ చట్టాన్ని మార్పు చేయవద్దని, కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. ఎసైన్షియా కంపెనీ యామాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల 18 మంది కార్మికులు ప్రాణాలను కోల్పోయారని, 50 మంది వరకూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అన్నారు. వివిధ సంఘాల నాయకులు టి.రామారావు, జి.శ్రీనివాసరావు, బి.రాము, ఎన్.నాగేశ్వరరావు, తమ్మినేని రవి, మాన్యం రమణ, ఎల్ రామప్పడు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

- మృతుని భార్య తొమ్మిది నెలల గర్భిణి



రెడ్డి జయరాం

సోంపేట: మండలంలోని మాకన్నపురం పంచాయతీ శారదాపురం రహదారి వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గొల్లగండి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డి జయరాం (37) మృతి చెందాడు. స్థానికులు, బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డి అప్పారావు, తులసమ్మల కుమారుడు జయరాం. వీరి స్వగ్రామం పాత్రకొండ.

కొర్లాంలో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. జయరాం వెల్ఫేర్ అసిస్టెంట్‌గా మండలంలోని గొల్లగండి సచివాలయంలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మాకన్నపురం వెళ్లాడు. తిరిగి వస్తుండగా బండి అదుపు తప్పడంతో కింద పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బారువ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ మృతి చెందాడు. జయరాంకు ఏడాది కిందటే వివాహమైంది. భార్య తొమ్మిది నెలల గర్భిణి. జయరాం మృతితో గొల్లగండి, కొర్లాం, పాత్రకొండ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, సచివాలయాల సిబ్బంది సంతాపం తెలియజేశారు. బారువ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోదుగువలస కాలనీలో నిలిచిన వర్షం నీరు



ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస కాలనీలో వర్షం నీరు, ఇళ్లలో వాడుక చేసిన నీరు నిలిచిపోయింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు వీధుల్లోనే నిలిచిపోవడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మురికినీరు కారణంగా భరించలేని దుర్గంధం వెదజల్లుతుందని చెపుతున్నారు. ఈ నెల 1వ తేదీన పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్లు పంపిణీ చేసేందుకు కాలనీకి వచ్చారని, అప్పుడు మురికినీటి సమస్య, డ్రైనేజీ పూడికలు కోసం ఆయన దృష్టికి తీసుకువెళ్లామని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షం నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

బైక్ ప్రమాదంలో ఒడిశా యువకుడు దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్, పోలీసులు

కంచిలి: కంచిలి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. ఒడిశా గజపతి జిల్లా పర్లాఖిమిడి పట్టణం కటిక గౌడ వీధికి చెందిన జయంతి బారిక్, బికాస్ చంద్ర బారిక్(35)లు శుక్రవారం వేకువజామున రెండున్నర గంటలకు పర్లాఖిమిడి నుంచి గోపాల్‌పూర్ బీచ్‌కు స్కూటీపై బయల్దేరారు. కంచిలి వచ్చేసరికి బైక్ డ్రైవింగ్ చేస్తున్న జయంతి బారిక్ అతివేగంగా నడుపుతూ అదుపు తప్పి, రోడ్డుకు కుడివైపు ఉన్న ఇనుప రైలింగ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు కింద పడిపోయారు. కొద్ది దూరం వరకు బండి ఈడ్చుకెళ్లిపోయింది. బైక్ వెనుక కూర్చున్న బికాస్ చంద్ర బారిక్ మెడకు రైలింగ్ కోసెయ్యడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రికి నిమిత్తం తరలించారు. మృతుని తండ్రి హరికృష్ణ దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైక్ ప్రమాదానికి కారకుడైన జయంతి బారిక్ మీద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.

చెరువులో పడి హోం గార్డు మృతి



మృతి చెందిన కాంతారావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం ఆవరణలోని మరిడమ్మ గుడి సమీపంలో ఉన్న ఎర్ర చెరువులో హోం గార్డు తాడివలస కాంతారావు (54) ప్రమాదవశాత్తు శుక్రవారం పడి దుర్మరణం చెందారు. ఆయన ఆర్మ్‌డ్ రిజర్వ్ బ్యాండ్ పార్టీలో విధులు నిర్వహిస్తున్నాడు. డ్యూటీలో భాగంగా కార్యాలయానికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు ఊబిలోకి వెళ్లిపోయాడు. తోటి సిబ్బంది కళ్ల ముందే సంఘటన జరిగింది.

రక్షించే ప్రయత్నం చేసినా ఊబి పెద్దగా ఉండటంతో సాధ్యం కాలేదు. మృతదేహాన్ని బయటకు తీసేందుకు కూడా చాలా శ్రమించాల్సి వచ్చింది. జాలరుల కూడా వలలతో వెతకగా కొన్ని గంటల తర్వాత మృతదేహం లభ్యమైంది. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు సత్యనారాయణ ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. భార్య ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

877 మంది హాజరు



ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నారు. క్యాంపస్‌లో శుక్రవారం నాటికి 877 మంది రిపోర్టు చేశారు. వీరిలో బాలికలు 608, బాలురు 269 మంది ఉన్నారు. క్యాంపస్‌లో 1100 సీట్లకు ప్రస్తుతం 941 మందికి సీట్లు కేటాయించారు. వీరిలో బాలికలు 639 మంది, బాలురు 302 మంది ఉన్నారు. 64 మంది విద్యార్థులు ఇంకా హాజరుకావాల్సి ఉంది. వీరిలో చాలా మంది క్యాంపస్ ట్రాన్స్‌ఫర్ కోసం ఎదురు చూస్తున్నారు. క్యాంపస్ మార్పుల ప్రకటన తర్వాత మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. క్లాస్‌వర్క్ పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సుపై అవగాహన కల్పిస్తున్నారు. పీయూసీ కోర్సు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సులపై అవగాహన నిర్వహణ, కరిక్యులమ్, సిలబస్ వివరిస్తున్నారు. ఇంజినీరింగ్ తరువాత ఉద్యోగ, ఉపాధి, ఉన్నత విద్యపై అవకాశాలు తెలియజేస్తున్నారు.